పడిపోతున్న మక్కల ధరలు!



ఎనుమాముల మార్కెట్‌లో మక్కల ధరలు క్రమక్రమంగా తగ్గిపోతున్నాయి. ఈ నెల 12న మక్కలకు క్వింటా 3,070 ధర రావడంతో ఈసారి పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందని ఆశించిన అన్నదాతకు నిరాశే మిగులుతుంది. మంగళవారం క్వింటాకు రూ.2,590 పలకడంతో.. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంటలో తేమ సాకుతో రోజుల వ్యవధిలోనే క్వింటాపై రూ.వందల్లో కోత విధించడంపై మార్కెట్ అధికారులు దృష్టి సారించాలని, గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు మార్కెట్‌కు ఇప్పుడిప్పుడే వస్తున్న కొత్త పత్తి ధరలు తగ్గుతుండటంతో.. రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం క్వింటా కొత్త పత్తికి రూ.7,510 పలకగా.. మంగళవారం క్వింటా 7,225 ధర పలికింది.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్

భద్రకాళి ఆలయంలో ప్రసాదాల తనిఖీ

రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవాలయంలో లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీని మంగళవారం జిల్లా ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారి కృష్ణమూర్తి పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ జారీ చేసిన దిట్టం ఉత్తర్వుల ప్రకారం ముడిసరకుల నాణ్యత, నెయ్యి తనిఖీ చేశారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల నమూనాలు తీసుకున్నారు. ఈవో శేషుభారతి, పర్యవేక్షకుడు విజయ్‌కుమార్ తదితరులున్నారు.

వీధి కుక్కల స్వైర విహారం



వీధి కుక్కల నియంత్రణకు పురపాలిక ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని ప్రకటిస్తున్నారు. మరోవైపు వివిధ ప్రాంతాల్లో గ్రామ సింహాల స్వైర విహారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. స్థానిక సంజయ్‌నగర్ కూడలిలో రాత్రివేళ కుక్కలు గుంపులు గుంపులుగా వీధుల్లో తిరుగుతుండటంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత వాసులు అధికారులను కోరుతున్నారు. – జనగామ, న్యూస్‌టుడే

కోడి కూయక ముందే..

మద్యం జోరు!



రహదారులపైనే తాగుతూ.. ఊగుతూ...!

– వరంగల్‌క్రైం, జనగామ టౌన్, న్యూస్‌టుడే

మీకు తెలుసా.. 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019–22 ప్రకారం.. దేశంలో అత్యధికంగా తాగుడు అలవాటున్న రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉంది.. రాష్ట్రంలో 43 శాతం మందికి మద్యం తాగే అలవాటున్నట్లు వెల్లడైంది. మరోవైపు మద్యానికి బానిసై.. డీఅడిక్షన్ కేంద్రాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.'

ఒకప్పుడు పండగకో.. పబ్బానికో మద్యం తాగేవారికి.. ఇప్పుడు సమయం.. సందర్భం అవసరం లేదనిపిస్తోంది. ఎప్పుడు పడితే.. అప్పుడే.. ఎక్కడపడితే అక్కడే.. అది అందుబాటులో ఉండడంతో.. చాలామంది దానికి బానిసలవుతున్నారు. మద్యం దుకాణాలకు తోడు గల్లీకో బెల్టుషాపు దర్శనమిస్తోంది. వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాకేంద్రాల్లో కోడి కూయక ముందే ప్రారంభమై రాత్రి ఒంటిగంట వరకు బార్లు దోర్లు తెరుచుకుని ఉంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నా.. ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం 'న్యూస్‌టుడే బృందం' నిర్వహించిన పరిశీలనలో సమయపాలన పాటించని మద్యం దుకాణాలు, పలువురు రహదారుల పక్కనే కూర్చొని మద్యం తాగుతూ కనిపించారు.



జనావాసాల మధ్య జనగామలో...



చిన్నపెండ్యాల వద్ద రహదారి పక్కన..

ఇవీ నిబంధనలు..

- మద్యం దుకాణాలు (వైన్స్) ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకే తెరిచి ఉండాలి. బార్లు 11 వరకు అనుమతి ఉంటుంది.
- ప్రతి దుకాణానికి ప్రభుత్వం మద్యం తగడానికి గది అనుమతి ఇస్తుంది. అది లేనప్పుడు దుకాణం నుంచి కొనుగోలు చేసి తీసుకొని వెళ్లాలి.
- వైన్స్ ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుండాలి.
- 21 ఏళ్ల లోపువారికి మద్యం అమ్మొద్దు.
- మద్యం సీసాలపై ఉన్న ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మొద్దు.
- జాతీయ రహదారులకు 225 మీటర్లలోపు మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు. గుడి, బడికి 100 మీటర్లలోపు ఉండొద్దు.
- మద్యం కల్తీ జరగకుండా పర్యవేక్షణ తప్పనిసరి.

ఇదీ పరిస్థితి..

- సాయంత్రం మద్యం దుకాణాలు జాతరను తలపిస్తున్నాయి. రహదారికి ఆనుకుని ఉన్నచోటవాహదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
- రాత్రి 10 తర్వాతా మద్యం విక్రయిస్తున్నారు. గొలుసు దుకాణాన్ని తెరిచి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.
- వయస్సుతో సంబంధం లేకుండా పిల్లలకు సైతం అమ్ముతున్నారు.
- ప్రత్యేక సాకులు చూపి రహదారులపైనే నిర్వహిస్తున్నారు.
- మద్యం దుకాణాల వద్ద ఆహార పదార్థాలు, తినుబండారాలు అమ్మకూడదు. అధికారులు ఇవేవి పట్టించుకోరు.
- అనేక చోట్ల రోడ్డు వెంట ఉన్న మద్యం దుకాణాలతో సాయంత్రం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.
- ఇష్టారీతిన అమ్మకాలు చేస్తున్నారు. క్వార్టర్, ఆఫ్, ఫుల్ బాటిల్‌కు రూ.30, 50, 100 చొప్పున అధిక ధరలకు గొలుసు దుకాణాలకు విక్రయిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా నిర్వహణ..

జనగామ పట్టణంలోని సూర్యాపేట, సిద్దిపేట, హైదరాబాద్ రోడ్ల వైపు ఉన్న మద్యం దుకాణాల ఎదుట మందుబాబులు అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తుండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి కేవలం కొన్ని టేబుళ్లకే సిట్టింగ్ అనుమతి తీసుకుని పరిమితికి మించి వినియోగిస్తున్నారు. అధికారులు ఏనాడూ 'మామూలు'గా తనిఖీలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పలు బ్రాండ్‌లలో కల్తీ అవుతోందని పలుమార్లు గొడవలు కూడా జరుగుతున్నాయి. అలాగే మందుబాబులు జనావాసాల మధ్యనే తాగుకుంటూ, మూత్ర విసర్జన చేస్తున్నారు. రాత్రిళ్లు మహిళలు, యువతులు ఆయా ప్రాంతాల్లో ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఆయా వైన్స్‌లలో నాసిరకం వంటకాలు తయారు చేస్తున్నారనే ఆరోపణలున్నా, వాటినీ పట్టించుకునే వారు కరవయ్యారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రజల భద్రత దృష్ట్యా నిబంధనలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

విమర్శల నుంచి హత్యారోపణ వరకు

జనగామ కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

జనగామ, న్యూస్‌టుడే: ప్రజాపాలనతో రాష్ట్రాభివృద్ధి తమ ధ్యేయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటిస్తున్నారు. వివిధ పథకాలతో పాలనను పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు ప్రతిపక్షాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ బాధ్యులతో పార్టీ నాయకులు ముందుకు సాగుతున్నారు. కానీ రాష్ట్రంలో ఎక్కడా లేని పరిస్థితి జనగామ నియోజకవర్గంలో నెలకొంది. అత్యధిక పర్యాయాలు కాంగ్రెస్ జెండా ఎగిరిన ఈ నియోజకవర్గంలో ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి, జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఓటమి రాజేసిన చిచ్చు, కొమ్మూరి అనుకూల, వ్యతిరేక వర్గాలుగా విడిపోయాయి. తాజాగా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరిపై జనగామ మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ కంచ రాములు చేసిన హత్యారోపణ ఫిర్యాదు సంచలనమైంది.

ఆజ్యం పోసిన ఓటమి..

రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్న తరుణంలో జనగామలో 50 వేల మెజార్టీతో కొమ్మూరి గెలుపు ఖాయమని ప్రకటించారు. కానీ భారాస అభ్యర్థి పల్లారాజేశ్వర్‌రెడ్డి సకల శక్తులను వినియోగించి 15వేల పై చిలుకు ఓట్ల తేడాతో గెలిచారు. సొంత ఇలాఖ చేర్యాల నుంచి బచ్చన్నపేట దాకా ప్రతి మండలంలో కొమ్మూరి వెనుకబడ్డారు. ఎన్నికల్లో అక్రమాలతోనే పల్లా గెలిచారని కొమ్మూరి ఆరోపించి, కేసు వేశారు. మరోవైపు తన ఓటమికి జనగామ మున్సిపల్ మాజీ ఛైర్మన్లు వై.సుధాకర్, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, మాజీ వైస్‌ఛైర్మన్ కంచ రాములు, తదితరులు కారణమని ఆయన ఆరోపించారు. అప్పట్లో సమీక్ష సమావేశం సందర్భంగా వై.సుధాకర్‌కు, కొమ్మూరికి మధ్య జరిగిన వాగ్వాదం దూషణలతో విభేదాలు ప్రారంభమయ్యాయి. దీంతో సానుకూల, వ్యతిరేకవర్గంగా ఏర్పడి, రాష్ట్ర మంత్రులు, పార్టీ నాయకుల వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నారు.

మార్కెట్ కమిటీతో ముదిరిన జగడం..

- జనగామ మార్కెట్ కమిటీ అధ్యక్ష పదవి హామీ, కంచ రాములు కొమ్మూరి మధ్య దూరాన్ని పెంచింది. ఇదే సమయంలో వై.సుధాకర్ కారుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. కొమ్మూరే కారణమని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్కెట్ పదవి విషయమై సీనియర్ నాయకుడు సర్వల నర్సింగరావుకు ప్రతాప్‌రెడ్డికి మధ్య వాగ్వాదం మరోసారి రచ్చకెక్కింది.
- ఈ క్రమంలోనే ప్రజాపాలన దినోత్సవం రోజున అధికార వేదికపై కొమ్మూరి కూర్చోవడాన్ని వై.సుధాకర్, లింగాజీ తదితరులు వ్యతిరేకించారు. ఈ వ్యవహారం మరోసారి గాంధీ భవన్ దాకా చేరింది. పార్టీ కార్యక్రమాలు ఎవరికి వారే నిర్వహించడం సాధారణమైంది. తాజాగా పార్టీ ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ తదితరుల వద్ద ఇరువర్గాలు పరస్పర ఆరోపణలు ఫిర్యాదులు చేసుకున్నారు. త్వరలో వర్గపోరుకు స్వస్తి పలికే చర్యలుంటాయని భావిస్తున్న తరుణంలో కంచ రాములు కొమ్మూరిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం సంచలనం కలిగించింది. ఇదంతా కుట్రగా కొమ్మూరి ప్రకటించారు. చేర్యాల నుంచి జనగామ వరకు పలువురు సీనియర్లు తనకు వెన్నుపోటు పొడిచారని కొమ్మూరి వాదన. ఈ గొడవలు చిలికిచిలికి జడివాన కాకముందే పార్టీ పెద్దలు సముదాయింపు చర్యలు ఉంటేనే మేలు అని నియోజకవర్గంలోని పలువురు పార్టీ సీనియర్ నాయకులు చర్చించుకుంటున్నారు.

జాతీయ రహదారిలో సమస్యలు పరిష్కరించండి



ప్రాంతీయ అధికారి శివశంకర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్ న్యూస్‌టుడే: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని జాతీయ రహదారిపై ఉన్న నిడిగొండ, చాగల్లు, స్టేషన్‌ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణపురం వరకు సర్వీస్ రోడ్లను పొడిగించాలని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మంగళవారం జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి శివశంకర్‌కు విన్నవించారు. హైదరాబాద్‌లోని జాతీయ రహదారుల అధికారి కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించి వినతిపత్రాలను అందించారు. హైదరాబాద్ నుంచి భూపాలపట్నం వరకు 163 జాతీయ రహదారిలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో సర్వీస్ రహదారులు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్నపెండ్యాల గ్రామ పరిధిలో సెంట్రల్ లైటింగ్ లేనందున ట్రాఫిక్ సమస్యతో పాటు నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని వివరించారు. సర్వీస్ రోడ్డు పొడిగింపుతో పాటు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి 563 వరంగల్-ఖమ్మం రహదారిని నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరగా రీజినల్ అధికారి సానుకూలంగా స్పందించి త్వరలోనే పనులు చేపడతామని వివరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దుర్గప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మండల విద్యాధికారుల నియామకం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌ఛార్జి మండల విద్యాశాఖాధికారులు(ఎంఈవో)గా నియమిస్తూ పాఠశాల విద్యా సంచాలకులు ఇ.వి.నరసింహారెడ్డి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి..

మండలం	ఎంఈవో పేరు	పనిచేస్తున్న జడ్పీహెచ్ఎస్ పాఠశాల
బచ్చన్నపేట	ఐ.వెంకట్‌రెడ్డి	ఇటికాలపల్లి
చిల్పూర్	డి.గోవర్ధన్	రాజవరం
దేవరుప్పుల	జి.కళావతి	చిన్నమడూర్
స్టేషన్‌ఘన్‌పూర్	జి.కొమురయ్య	చాగల్
జనగామ	వి.రాజేందర్	గానుగుపహాడ్
కొడకండ్ల	వై.గ్రేస్ కేజియా రాణి	కొడకండ్ల
లింగాలఘనపురం	పి.విష్ణుమూర్తి	వనపర్తి
నర్మెట్ట	ఎం.అయిలయ్య	వెల్దండ
పాలకుర్తి	పి.నర్సయ్య	వావిలాల
రఘునాథపల్లి	పి.రఘునందన్‌రెడ్డి	వెల్ది
తరిగొప్పుల	ఎన్.జానకి	తరిగొప్పుల(జి)
జఫర్‌గఢ్	ఎండీ.పర్వేజ్	కూనూరు

● మండలం ● ఎంఈవో పేరు ● పనిచేస్తున్న జడ్పీహెచ్ఎస్ పాఠశాల

రైస్ మిల్లు యజమానిపై కేసు నమోదు

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: సీఎంఆర్ ధాన్యాన్ని సేకరించి, దారి మళ్లించిన రైస్ మిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం అతిరాం మంగళవారం ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌లో ఏర్పాటు చేసిన శ్రీసాయి రామ్ మోడరన్ రైస్ మిల్లుకు గతేడాది రైతుల నుంచి సేకరించిన 1987.560 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యాన్ని అందించామన్నారు. ఈ క్రమంలో ఈ నెల 12న తనిఖీలు నిర్వహించిన అధికారులు ఉండాల్సిన 5.67 కోట్ల విలువైన ధాన్యం నిలువలు లేవని గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. మిల్లు యజమాని చంద్రశేఖర్‌రెడ్డిపై దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ధాన్యం రికవరీ యాక్టును ప్రారంభించాలని దేవరుప్పుల తహసీల్దార్ హుస్సేన్‌ను ఆదేశించామని చెప్పారు. యజమాని సహా కుటుంబ సభ్యుల పేరిట లావాదేవీలను నిలిపివేయాలని జిల్లా సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణం హైదరాబాద్ రోడ్డు వైపు ఉన్న సయ్యద్ యాకూబ్‌షా వలీ ఉర్సు ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దర్గాలో ముతవల్లులు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందువులు, ముస్లింలు మత సామరస్యంతో పండగలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. దర్గాలను హిందువులు కూడా అధిక సంఖ్యలో దర్శించుకోవడం తెలంగాణలో సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.జమున, నాయకులు తాళ్ల సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో సమాజ సేవ

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: సమాజ సేవ చేయాలనుకునే యువత ఎన్‌ఎస్‌ఎస్‌లో చేరి సామాజిక సేవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఏ.నర్సయ్య అన్నారు. మంగళవారం జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు అనగాని శ్రీనివాస్, నవీనారాణి, శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో పాలకుర్తి ఆదర్శం..



ప్రసంగిస్తున్న లేగ రాంమోహన్‌రెడ్డి

పాలకుర్తి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదులో పాలకుర్తి రాష్ట్రంలో ఆదర్శంగా నిలుస్తోందని, నియోజకవర్గంలో ఇప్పటికే లక్ష పైచిలుకు ప్రవేశాలు జరిగాయని ఆ పార్టీ సభ్యత్వ నమోదు రాష్ట్ర ఇన్‌ఛార్జి గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో నమోదుపై ముఖ్య నేతలతో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంమోహన్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చౌడ రమేశ్, రాజశేఖర్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధులు నిరంజన్‌రెడ్డి, చింత సృజన్, మండలాధ్యక్షుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వెక్కిరిస్తున్న శిలాఫలకలు



తిమ్మంపేటలో పంచాయతీ భవన నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: పల్లెసీమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు కేటాయించారు. పంచాయతీలకు నూతన భవనాలను నిర్మించుకోటానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు కేటాయించింది. జఫర్‌గఢ్ మండలంలోని తిమ్మంపేట , జఫర్‌గఢ్, ఏబీ(శంకర్)తండా, దుర్గ్యానాయక్‌తండా, తీగారం, ముగ్ధుంతండాలో నూతనంగా పంచాయతీ భవనాలను నిర్మించేందుకు గత ఏడాది ఫిబ్రవరిలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రూ.20 లక్షలు మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శంకుస్థాపన చేశారు. సర్పంచుల పాలనలో భవనాలు మంజూరైతే నిర్మాణ పనులు మొదలు పెట్టకుండా నిర్లక్ష్యం చేశారు. నిధులు మూలుగుతున్నా భవనాల పనులు మొదలు పెట్టకుండా వదిలేశారు. పంచాయతీలకు సొంత భవనాలు లేక పోవడంతో ఆరకొర వసతులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాల్లో కనీస వసతులు లేక పోవడంతో ప్రజలు, అధికారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య విద్యకు కొత్త హంగులు

వచ్చే ఏడాదికి పీజీ కోర్సులు



కొనసాగుతున్న వైద్య కళాశాల శాశ్వత భవన నిర్మాణ పనులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ జిల్లాకు గత ఏడాది వైద్య కళాశాల ప్రారంభం కావడంతో మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని రెండో ఏడాదిలోకి ప్రవేశించింది. ఈ ఏడాది కొత్తగా మంజూరైన నర్సింగ్ కళాశాల కూడా తాత్కాలికంగా ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించబోతున్నారు. ఈ తరుణంలో జిల్లా వైద్య విద్య ముఖచిత్రంలో రానున్న రోజుల్లో మరో ముందడుగు పడనుంది. ఎంబీబీఎస్ తర్వాత చాలా మంది విద్యార్థులు ప్రత్యేక స్పెషలైజేషన్‌లో భాగంగా పీజీ కోర్సు కూడా పూర్తి చేస్తారు. ఈ తరుణంలో జనగామ వైద్య కళాశాలలో పీజీ కోర్సు కూడా ప్రారంభించడానికి వైద్య కళాశాల వర్గాలు నిమగ్నమయ్యారు. ఇందుకుగాను ప్రతిపాదనలను తయారు చేసే పనిలో ఉన్నారు.

4 విభాగాల్లో 16 పీజీ సీట్లకు ప్రతిపాదనలు..

జిల్లా కేంద్రంలో వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జిల్లా జనరల్ ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రిలో.. జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్, గైనిక్, పీడియాట్రిక్ విభాగాల్లో ఓపీ సేవలతో పాటు శస్త్ర చికిత్సలు కూడా గణనీయంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా నాలుగు విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సరిపడా ఉన్నారు. ఈ క్రమంలో సదరు నాలుగు విభాగాల్లో వచ్చే ఏడాది నుంచి వైద్యవిద్యలో పీజీ కోర్సులు ప్రవేశపెట్టడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం వైద్య కళాశాలకు అవసరమయ్యే 330 పడకలు ఉండగా, ఎంసీహెచ్ ఆసుపత్రి పక్కనే రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించిన క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవనం పూర్తయితే మరో 100 పడకలు అందుబాటులోకి రానున్నాయి. పీజీ కోర్సులు ప్రారంభించడానికి నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) నిబంధనల ప్రకారం అనుబంధ ఆసుపత్రుల్లో 420 పడకలు ఉండాల్సి ఉండగా మరో వంద పడకలు అందుబాటులోకి వస్తే మొత్తం 430 పడకలు జనగామ వైద్య కళాశాలకు రానున్నాయి. దీంతో వచ్చే ఏడాదికి గాను జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్ విభాగాల్లో ఒక్కో విభాగంలో నాలుగు సీట్ల చొప్పున మొత్తం 16 పీజీ సీట్లు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రతిపాదనలు తయారు చేశారు. త్వరలో కలెక్టర్ ఆమోదంతో ప్రభుత్వానికి సమర్పించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలో ఎన్‌ఎంసీ బృంద సభ్యులు జిల్లాలో పర్యటించనున్నట్లు తెలిసింది. వారి పర్యటన నాటికి మరో 100 పడకలు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. అమలైతే వైద్యరంగ చరిత్రలో మరో ముందడుగుగా నిలుస్తోందని పలువురు విద్యాభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వివరాలు..

జిల్లా జనరల్ ఆసుపత్రి, ఎంసీహెచ్‌లో పడకలు : 330
కొత్తగా అందుబాటులోకి రానున్న పడకలు : 100
నూతనంగా మంజూరు కానున్న పీజీ వైద్య సీట్లు : 16
నర్సింగ్ కళాశాలలో సీట్లు : 60

మెరుగుపడనున్న సేవలు..

జనగామలో ఇప్పటికే డీఎంఈ పరిధిలో వైద్య కళాశాల/జనరల్ ఆసుపత్రిలో ప్రొఫెసర్ స్థాయి వైద్యులు సేవలందిస్తున్నారు. ఇక పీజీ కోర్సులకు అనుమతి ఇస్తే మరో 16 మంది పీజీ వైద్య విద్యార్థులు ఆయా విభాగాల్లో సేవలందించనున్నారు. దీంతో జిల్లా జనరల్ ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రిలో ఆయా విభాగాల్లో సేవలు మెరుగుపడనున్నాయని భావిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపిస్తాం.. - డాక్టర్ దుగ్యాల గోపాల్‌రావు, జనగామ వైద్య కళాశాల ప్రిన్సిపల్

జనగామ వైద్య కళాశాలలో వచ్చే ఏడాది నుంచి పీజీ కోర్సులు ప్రారంభించడానికి చర్యలు చేపట్టాం. ఇందుకుగాను పడకల వివరాలు, మౌలిక వసతుల ఏర్పాట్లు, తదితర వివరాలను ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించాం. ఎన్‌ఎంసీ బృంద సభ్యుల తనిఖీ తర్వాత అనుమతి రానుంది.

కల్తీ ముప్పు.. కనిపెడితేనే మేలు..!



‘తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూ తయారీలో జరిగిన తప్పిదాలపై పెద్ద ఎత్తున విమర్శలొస్తున్న నేపథ్యంలో కల్తీపై అంతటా చర్చ జరుగుతోంది. ఆ బ్రహ్మాండ నాయకుడి ప్రసాదంలోనే కాదు మన నిత్య జీవితంలో వాడే ఆహారపదార్థాల్లోనూ కల్తీ జరుగుతోంది. దీన్ని గుర్తించి జాగ్రత్త పడాల్సిన బాధ్యత మనదే’

ప్రస్తుతం కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా రోజులు మారాయి. విపణిలో కల్తీ ఆహార పదార్థాలు రాజ్యమేలుతున్నాయి. మనం చూసే ప్రతిదీ అందంగా ఆకర్షించేలా కనిపిస్తున్నా లోపల మాత్రం ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు జోడించి తయారు చేసిన ఉత్పత్తులుంటున్నాయి. నిత్యం ఆరోగ్య రక్షణకు వినియోగించే సర్వరోగ నివారిణి తేనె, తాగే పాలు మొదలు వంటకాల్లో వాడే నూనె, కారం, పసుపు నుంచి మసాల వరకు కల్తీ బారిన పడినవే. వాటిని తింటూ వ్యాధులను కొనితెచ్చుకుంటున్నాం. ఈ నేపథ్యంలో పదార్థాల నాణ్యత తనిఖీ చేయడం అవసరం. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించిన పద్ధతి ప్రకారం ఇంట్లోనే కల్తీని గుర్తించే విధానంపై కథనం.

ఈనాడు, మహబూబాబాద్



పాలు



● **కల్తీ చేసే పదార్థాలు:** స్టార్చ్ (పిండి పదార్థాలు), డిటర్జెంట్ పౌడర్

● **గుర్తించే విధానం:** 5-10 ఎం.ఎల్., పాలు తీసుకుని వాటికి సమానమైన నీటితో బాగా కలపాలి. డిటర్జెంట్ కలిసి ఉంటే చిక్కని నురగ వస్తుంది. స్వచ్ఛమైన పాలు అయితే సన్నని నురగ పొర ఏర్పడుతుంది.

పాలను వేడి చేసి అందులో కొన్ని చుక్కల అయోడిన్ వేస్తే అవి నీలం రంగులో మారితే స్టార్చ్ (పిండిపదార్థాల)తో కల్తీ చేసినట్లే.

కారం



● ఇటుక పొడి, సింథటిక్ కలర్

● గాజు గ్లాసులో నీటిని తీసుకుని అందులో మిరపపొడిని వేయాలి. ఇటుక పొడి ఉంటే అది నీటి అడుగుభాగానికి చేరుతుంది. గాజు పాత్రలో నీటిపై కారం పొడిని వేస్తే కృత్రిమ (సింథటిక్) రంగు చారల రూపంలో కిందికి దిగుతుంది.

నల్ల మిరియాలు



● బొప్పాయి గింజలు

● ఒక గ్లాసు నీటిలో కొంత మొత్తంలో నల్ల మిరియాలు వేయాలి. స్వచ్ఛమైనవి అడుగు భాగానికి చేరుకుంటాయి. బొప్పాయి గింజలు నీటిపై తేలుతాయి.

తేనె



● చక్కెర ద్రావణం

● స్వచ్ఛమైన తేనెకు మండే స్వభావం ఉంటుంది. నాణ్యమైన తేనెలో పత్తిని ముంచి మండిస్తే మండుతుంది. ● ట్రాన్స్‌పరెంట్ గ్లాసు పాత్రలో నీళ్లు తీసుకోవాలి. అందులో కొద్దిగా తేనె వేస్తే అది విడిపోతే అందులో చక్కెర ఉన్నట్లు గుర్తించాలి. ● గిన్నెలో నీటిని తీసుకుని అందులో కొద్దిగా తేనెను వేసి వేడి చేయాలి. అప్పుడు చిన్న చిన్న శబ్దాలు వినిపిస్తే చక్కెర కలిపినట్లు. కల్తీ జరగకుంటే ఎలాంటి శబ్దం రాదు. ● ఒక గ్లాసులో కొన్ని నీళ్లు తీసుకుని అందులో ఒక చెంచా తేనె కలిపి కాస్త వెనిగర్ వేయాలి. నురగ వస్తే అది కల్తీ అయినట్లు.

కాకరకాయ, పచ్చిమిర్చి, ఇతర ఆకుకూరలు



● ఆకర్షణ చేలా కృత్రిమ రంగు పూయడం

● నీటిలో, వెజిటబుల్ ఆయిల్‌లో ముంచిన పత్తి దూదిని తీసుకోవాలి. దాన్ని కూరగాయాలపైన రుద్దాలి. దూది ఆకుపచ్చగా మారితే వాటిని కృత్రిమ రంగుతో కల్తీ చేసినట్లు.

నెయ్యి



● పిండిపదార్థం

● గాజు గ్లాసులో కొద్దిగా నెయ్యిని తీసుకొని అయోడిన్ ద్రావణాన్ని కలపాలి. నీలంరంగులోకి మారితే పిండి పదార్థాలతో కల్తీ చేసినట్లు.

ఒక చెంచా నెయ్యిని ఒక గ్లాసు నీటిలో కలిపితే స్వచ్ఛమైన నెయ్యి ఉపరితలంపై తేలుతుంది. నీటిలో కలిసినా, దిగువకు చేరితే అది నూనెలతో కల్తీ కావొచ్చని అర్థం.

పసుపు



● మెటానిల్ ఎల్లో, సన్‌సెట్ ఎల్లో, బియ్యం పిండి

● పరీక్ష నాళికలో కొద్దిగా పసుపు పొడిని తీసుకొని నీటిని కలపాలి. గాఢమైన పసుపు రంగు ఏర్పడితే కల్తీ జరిగినట్లు. బియ్యం పిండి ఉంటే నీటి అడుగులోకి చేరుతుంది.

కంది, పెసర పప్పు



● కేసరి పప్పు, మెటానిల్ ఎల్లో రంగు, టెట్రాజయిన్

● కేసరి పప్పు పలుకులుగా ఉంటుంది. దీన్ని భూతద్దం సహాయంతో గుర్తించొచ్చు. పరీక్ష నాళికలో కొద్దిగా కంది/పెసర పప్పును తీసుకొని కొద్దిగా నీటిని కలిపి దానికి 5 మి.లీ. గాఢ హైడ్రోక్లోరికామ్లం కలిపి 10 నిమిషాల తర్వాత పరిశీలిస్తే గులాబీ రంగులో మారితే కల్తీ జరిగినట్లు.

టీ/కాఫీ పొడి



● ఇనుప పొడి, కృత్రిమ రంగులు, చింతగింజల పొడి

● టీపొడిని కొద్దిగా తెల్లని కాగితంపై పలచగా పోసి దాంట్లో అయస్కాంతాన్ని తిప్పితే ఇనుప పొడి దానికి అతుక్కుంటుంది. ● చల్లని నీటిలో టీపొడిని కలిపితే 30 సెకన్లలో నీటి రంగు మారితే అది కల్తీ అయినట్లు. ● కాఫీ పొడిని చల్లని నీటిలో బాగా కలిపాలి. కాఫీ పొడి నీటిపై తేలి చింతగింజల పొడి ఉంటే అడుగు భాగానికి చేరి నీటిని మట్టి రంగులోకి మారుస్తుంది.

అనారోగ్య సమస్యలివే..



కల్తీ ఆహార ఉత్పత్తులను తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు, రక్తహీనత, పక్షవాతం, క్యాన్సర్, కంటి వ్యాధులు సంభవిస్తాయి. గుండె, ఊరిపితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి.

– డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, ఎండీ ఫిజిషియన్



వేరుశనగ, నువ్వుల నూనె



● సోయాబిన్, ఆర్జిమోజన్ నూనె

● ఒక పరీక్షనాళికలో కొద్దిగా నూనె, 5 మి.లీ గాఢ హైడ్రోక్లోరికామ్లం, కొద్దిగా పంచదార కలిపాలి. పరీక్ష నాళిక దిగువన గులాబీ, ఎరుపు రంగు ఏర్పడితే నూనెలు కల్తీ అయినట్లు.

కొబ్బరి నూనె



● మినరల్ ఆయిల్, పామ్ కెర్నల్

● శుద్ధమైన కొబ్బరి నూనెను ఫ్రిజ్‌లో పెట్టి అరగంట తర్వాత చూస్తే పూర్తిగా గడ్డకడుతుంది. సగం గడ్డకట్టి.. సగం కట్టకుంటే కల్తీ అయినట్లు.

ఇవి కూడా..



● అందరూ ఎంతో ఇష్టంగా తినే మిఠాయిల్లో రంగులను పరిమితికి మించి కలుపుతున్నారు. 100 పీపీఎం కంటే ఎక్కువగా కలిపిన మిఠాయిలను తింటే అనారోగ్యానికి దారి తీస్తాయి.

● ఇటీవల వరంగల్ జిల్లాలో ఒక మిఠాయి దుకాణంలో ఆహార భద్రతా అధికారులు వాటిని గుర్తించి జరిమానా విధించారు.

● కొబ్బరి పొడిలోనూ నాణ్యత లేనిది ఉంటుంది. కొబ్బరిపొడిలో 55శాతం నూనె ఉండాలి. లేకుంటే నాణ్యత లేనట్లు.

హనుమకొండలో 45 శాతం నూనె ఉన్న ఒక కంపెనీకి చెందిన కొబ్బరి పొడిని స్వాధీనం చేసుకున్నారు.



వారసంతల్లో ఎక్కువగా..

ఇది మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని వారసంత. ప్రతి మంగళవారం నిర్వహిస్తారు. వంటింట్లోకి అవసరమైన అన్ని సరకులను ఇలా పెట్టి విక్రయిస్తారు. ఇక్కడ కల్తీ ఎక్కువగా జరిగే ప్రమాదం ఉంది. పసుపు, పప్పులు, ఉల్లిగడ్డలు, సుగంధ ద్రవ్యాలు ఇలా ప్రతిదీ నాణ్యత లినివే ఉంటాయి. ఈ విషయం తెలియని చుట్టుపక్కల గ్రామాలు, తండాల్లోంచి ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తుంటారు.

ఇలా చేద్దాం

కారం పొడిని రైతుల వద్ద, ఎండు మిర్చి విక్రయాలు చేసే దుకాణాల వద్ద ఏడాదికి సరిపడా కొనుగోలు చేసి మరాడించుకుని భద్రపరుచుకుంటే చాలు. కల్తీ కారం నుంచి బయటపడొచ్చు. ఇలా కాకుండా ప్యాకెట్లలోని కారం కొనుగోలు చేయాలనుకుంటే ఆహార పరిరక్షణ ప్రమాణాల ప్రకారం ఉందా లేదా చెక్ చేసుకుని కొనాలి.

● గేదెలు సాకుతూ పాలను పట్టణాల్లోకి తీసుకొచ్చి విక్రయించే వారి వద్ద కొనుగోలు చేయాలి. గ్రామాల్లో ఆవులు, గేదెలను పోషిస్తూ వాటి పాల ద్వారా నెయ్యిని తీసి విక్రయాలు చేస్తారు. వారి వద్ద నాణ్యమైనది లభిస్తుంది. దానికి ధర అధికంగా ఉన్నా కొనుగోలు చేయడం ఉత్తమం.

● పసుపు సాగు చేసే కొందరు రైతులు దాన్ని ఉడికించిన తర్వాత పసుపు పొడిగా మాడించి విక్రయాలు చేస్తారు. వారి వద్ద కొంటే కల్తీ బారి నుంచి తప్పించుకోవచ్చు.

● తేనె రోడ్లపక్కన పెట్టి విక్రయాలు చేసే వారి వద్ద కొనుగోలు చెయ్యొద్దు. గ్రామాలు, ఏజెన్సీ గూడేలు, తండాల్లో చెట్లకు ఉన్న తుట్టెల ద్వారా సేకరించిన తేనెను గానీ, తేనెటీగల పెంపకం చేపడుతూ తేనె విక్రయించే వారి వద్ద తీసుకోవాలి. కొన్ని అధీకృత కంపెనీల వారు మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నారు. వాటిని కూడా కొనుగోలు చెయ్యొచ్చు.

‘దోచుకోవడం, దాచుకోవడం తప్ప భారాస చేసిందేమీ లేదు’



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, చిత్రంలో ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ మేయర్ సుధారాణి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గత పదేళ్లలో భారాస ప్రభుత్వం రూ. లక్షల కోట్ల అప్పులు చేసిందని, తీవ్ర ఆర్థిక లోటు ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్రానికి చేసిందేమీలేదని, విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్ర ఖజానాను దివాలా తీయించారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల పథకాల్లో అయిదు అమల్లోకి తెచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. భారాస ప్రభుత్వం వైద్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కేవలం నాలుగైదు కార్పొరేటు ఆసుపత్రులకు మాత్రమే ఎల్వోసీలు ఇచ్చారన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నామని, విద్య, వైద్యం, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సమావేశంలో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక



ప్రముఖుల ఘాట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్.. చిత్రంలో పాలనాధికారి రాహుల్ శర్మ

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వర క్షేత్ర మలివిడత అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక సిద్ధమవుతోంది.. మే నెలలో జరిగే సరస్వతీ పుష్కరాలపైనా దృష్టి సారించారు. కాళేశ్వర క్షేత్ర సన్నిధిలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, జిల్లా పాలనాధికారి రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్‌తో కలిసి పర్యాటక, దేవాదాయ శాఖ అధికారులతో క్షేత్ర అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో నిర్మాణాలు ఎంతమేరకు పూర్తి కావచ్చాయి..? మిగతా నిర్మాణాల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ఈవో మారుతిని ప్రశ్నించారు. సత్వరమే నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. రాబోయే సరస్వతీ పుష్కరాలకు ఏవిధంగా ప్రణాళిక చేస్తే బాగుంటుందని అధికారుల వద్ద సలహాలు తీసుకున్నారు. కాళేశ్వర క్షేత్ర అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులను పలు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. మేడిగడ్డ వద్ద బృందావన్ గార్డెన్ మాదిరి పర్యాటక ప్రాంతం అవసరమని, చిన్న మ్యూజియం ఏర్పాటు చేస్తే సందర్శకులు, చిన్నారి విద్యార్థులకు గొప్ప అనుభూతి కలిగిస్తుందని పర్యాటక శాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి సూచించారు. బృహత్తర ప్రణాళిక అమలుకు ముందు ఆలయ నిర్మాణాల తీరుపై శృంగేరి పీఠం వారికి వివరించాలని దేవాదాయశాఖ స్థపతి వల్లీ నాయగం సూచించారు. రూ.115 కోట్లతో కాళేశ్వరం, మంథని, రామగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జీఎం వివరించారు. గోదావరి తీర ప్రాంతం అపరిశుభ్రతకు తావులేకుండా పవిత్రతకు మారుపేరులా ఉండాలని శైలజారామయ్యార్ ఆదేశించారు. ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేయాలని సూచించారు. దేవస్థానం అతిథిగృహాలు అస్తికలు నిమజ్జనం చేసే భక్తులకు ఆలయ సిబ్బంది ఇవ్వడం లేదని కాళేశ్వరాలయం మాజీ ఛైర్మన్ కోటరాజబాపు, మాజీ ధర్మకర్త అశోక్ ఆమె దృష్టికి తీసుకురాగా ఈవోపై మండిపడ్డారు. క్షేత్ర ఆవరణలో భక్తులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. డిజైన్ టాయిలెట్స్ నిర్మాణాలు జరగాలని ఆదేశించారు.

నిజాయతీతో సేవలందిస్తే గుర్తింపు



సీపీని కలిసిన ఎస్సైలు అభ్యర్థులు

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పోలీసు ఉద్యోగంలో చేరిన తర్వాత ప్రజలకు నీతి, నిజాయతీతో సేవలందిస్తే మంచి గుర్తింపు ఉంటుందని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. పోలీసు కమిషనరేట్‌కు కేటాయించిన శిక్షణ పొందిన 19 మంది ఎస్సైలు మంగళవారం కమిషనరేట్‌లో సీపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. పోలీసు ఉద్యోగం చేస్తున్నందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలన్నారు. చట్టం పరిధిలో సేవలు అందిస్తూ పోలీసుశాఖ కీర్తి ప్రతిష్టలు పెంచాలన్నారు.

యథేచ్ఛగా మొరం తరలింపు



మల్లకపల్లి శివారులో మొరం కోసం వచ్చిన వాహనాలు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: ధర్మసాగర్ మండలం మల్లకపల్లి నుంచి రాంపూర్‌కు వెళ్లే దారిలో గుట్టల నుంచి మొరం అక్రమ రవాణా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ఏడాదికి పైగా గుట్టలను కొల్లగొడుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా అక్రమార్కులు ప్రకృతి సంపదను దోచుకుంటున్నా అధికారులు ఎవరూ స్పందించడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఊర చెరువు సమీపంలోని క్వారీ నుంచి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రాంపూర్ మీదుగా హనుమకొండ, వరంగల్ నగర శివార్లలో కొత్తగా వెలుస్తున్న వెంచర్లకు తరలిస్తున్నారు. ఇదే రహదారి మీదుగా వ్యవసాయ పొలాలకు వెళ్లే మల్లకపల్లి రైతులు, పనులకు వెళ్లే కూలీలు నిత్యం తిరిగే వాహనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక బరువుతో భారీ వాహనాలు తిరగడం ద్వారా రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం రాయల్టీ నష్టపోతున్నా, రోడ్లు శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఎండు గంజాయి పట్టివేత



పట్టుకున్న ఎండు గంజాయితో డీఎస్పీ తిరుపతిరావు, సీఐ బాబురావు, ఎస్సైలు గిరిధర్‌రెడ్డి, కుషకుమార్, సిబ్బంది

గూడూరు, న్యూస్‌టుడే: రెండు కార్లలో తరలిస్తున్న 187 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు డీఎస్పీ తిరుపతిరావు మంగళవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాకు చెందిన రాహుల్ మంజుదార్ (22), రాయపూర్‌కు చెందిన హరీష్ యాదవ్ (24), ఒడిశా రాష్ట్రంలోని మల్కనిగిరికి చెందిన మండల నరేష్ (32)లతో ఎండు గంజాయిని ఒడిశా నుంచి భద్రాచలం, ఇల్లందు, మహబూబాబాద్, గూడూరు మీదుగా హైదరాబాద్ తరలించేందుకు ఒడిశా రాష్ట్రంలోని మల్కనిగిరి జిల్లాకు చెందిన బాపన్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. రాహుల్ మంజుదార్, హరీష్ యాదవ్, మండల నరేష్ ఒడిశా నుంచి రెండు కార్లలో హైదరాబాద్ బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మండలంలోని మచ్చర్ల గ్రామం స్టేజీ వద్ద 365 జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో వస్తున్న రెండు కార్లను ఆపి సోదా చేయగా సుమారు రూ.46.76 లక్షల విలువైన 187.04 కిలోల ఎండు గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చేసుకొని రాహుల్ మంజుదార్, మండల నరేష్, హరీష్ యాదవ్, బాపన్‌లపై కేసు నమోదు చేసి రెండు కార్లు, మూడు చరవాణిలను స్వాధీనం చేసుకున్నారు.

‘ఐటీఐ’లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ చందర్ తెలిపారు. వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో 5వ విడత ప్రవేశాలకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 83741 01790లో సంప్రదించాలన్నారు.

ఎనుమామూలు పనులు

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఏడాది క్రితం రూ.17.07 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు అటకెక్కాయి. గతేడాది ఆగస్టు 16న అప్పటి పాలకవర్గం గడువు ముగిసే రెండు రోజుల ముందు హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. ఇప్పటి వరకు కేవలం 25 శాతం మాత్రమే పూర్తయ్యాయి. నిర్మాణ పనుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మార్కెట్ కమిటీ పాలకవర్గం లేక.. మార్కెట్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో.. నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. మరోవైపు పనులకు సంబంధించి అప్పటి పాలకవర్గానికి, మార్కెట్ అధికారులకూ కమీషన్లు అందినట్లు ఆరోపణలున్నాయి. అందుకే తమ హయాంలోనే పనులు ప్రారంభించాలని.. వేగిరపడినట్లు తెలుస్తోంది.

– న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్



అపరాల యార్డులో కమీషన్ దుకాణాల నిర్మాణాల పనులను మధ్యలోనే నిలిపేసిన గుత్తేదారు

రూ.కోట్ల ఆదాయం.. అభివృద్ధి శూన్యం

పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల కారణంగా.. ఫీజు రూపంలో మార్కెట్‌కు ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. గతేడాది ఫీజు రూపంలో రూ.43.39 కోట్ల ఆదాయం సమకూరగా.. ఈ ఏడాది రూ.56 కోట్ల ఆదాయాన్ని సాధించాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించింది. మార్కెట్ అభివృద్ధిని మాత్రం గాలికొదిలేశారు. రాత్రి సమయంలో విద్యుత్తు దీపాలు లేక మార్కెట్‌లోని యార్డులు చీకటిగా ఉంటున్నాయి. పత్తి, మిర్చి సీజన్లలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతు విశ్రాంతి భవనంలో మౌలిక సదుపాయాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ప్రాథమిక వైద్యశాలకు పూర్తిస్థాయిలో వైద్యపరికరాలు, మందులు సమకూర్చేందుకు తగిన నిధులు కేటాయించకపోవడంతో.. రైతులతో పాటు మార్కెట్‌లోని కూలీలు, హమాలీలు, వ్యాపారులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. మార్కెట్ పాలకవర్గం గడువు ముగిసి ఏడాది పూర్తయినా, మార్కెట్ అనేక సమస్యలతో సతమతమవుతున్నా.. స్థానిక మంత్రి, ఎమ్మెల్యేలు పాలకవర్గం నియామకంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. పత్తి, మిర్చి సీజన్లలో రైతులకు మద్దతుగా నిలవాల్సిన పాలకవర్గం ఏడాది నుంచి లేకపోవడంతో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల్లో వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

● అభివృద్ధి పనులు	● కేటాయించిన నిధులు(రూ.లక్షల్లో)	● ఇప్పటివరకు ఖర్చు (రూ.లక్షల్లో)
ధాన్యం, అపరాల యార్డులో ఉప కార్యాలయం నిర్మాణం	47	22.22
మిర్చి యార్డులోని ప్లాట్‌ఫాంల మధ్య ప్రీపెయింటెడ్ షీట్స్‌తో రూఫింగ్	444	191
పసుపు, పల్లికాయ యార్డులో ప్లాట్‌ఫాంల మధ్య ప్రీపెయింటెడ్ షీట్స్‌తో రూఫింగ్	293	64.77
మార్కెట్ రెండో గేట్ వద్ద కళాతోరణం నిర్మాణం	29	26.22
మార్కెట్ రెండో గేట్ వద్ద ఎడ్లబండ్లు, రైతుల ప్రతిమలు ఏర్పాటు	9.20	8.50
ధాన్యం, అపరాల యార్డులో 24×12 వైశాల్యంతో కొత్తగా 40 దుకాణాల నిర్మాణం	420	73.01
పత్తియార్డు కార్యాలయ మరమ్మతు పనులకు	17	0
పత్తియార్డు చుట్టుపక్కల ఉన్న డివైడర్లకు, బారికేడ్లకు సింథటిక్ పెయింటింగ్ పనులకు	10	0
మార్కెట్ చుట్టూ ప్రహరీ పనులకు	20	0
లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ప్రాంతీయ, జిల్లాస్థాయి మార్కెటింగ్ అధికారుల భవన సముదాయ నిర్మాణం	418	76.32



వేరుశనగ యార్డులో అసంపూర్తిగా షెడ్డు నిర్మాణం

గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం.

పి.నిర్మల, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

ఎనుమాముల మార్కెట్ పరిధిలోని గుత్తేదారులు చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల బిల్లులకు సంబంధించిన చెక్కులు ఆర్థికశాఖలో పెండింగ్‌లో ఉన్నాయి. కొంతకాలంగా గుత్తేదారులు నిర్మాణ పనులను నిలిపివేశారు. మార్కెటింగ్ శాఖ ఈఈ ద్వారా గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం.

ఎంసీహెచ్‌లో త్వరలో క్యాంటీన్‌ ప్రారంభం



మహిళాశక్తి క్యాంటీన్‌ ప్రతినిధులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్‌ పింకేశ్‌కుమార్‌

జనగామ టౌన్‌, న్యూస్‌టుడే: జనగామ పట్టణ శివారు చంపక్‌ హిల్స్‌ ప్రాంతంలో ఉన్న ఎంసీహెచ్‌ ఆసుపత్రిలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటున్న మహిళా శక్తి క్యాంటీన్‌ను త్వరలో ప్రారంభిస్తున్నట్లు అదనపు కలెక్టర్‌ పింకేశ్‌కుమార్‌ తెలిపారు. ఎంసీహెచ్‌లోని క్యాంటీన్‌ను ఆయన మంగళవారం సందర్శించి, మాట్లాడారు. రూ.8 లక్షలతో క్యాంటీన్‌ నిర్మించినట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసంత, ఎంసీహెచ్‌ సూపరింటెండెంట్‌ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు మాసాల్లో వీధి కుక్కల నియంత్రణ

జనగామ, న్యూస్‌టుడే: మూడు మాసాల్లో చంపక్‌హిల్స్‌లోని జంతు జనన నియంత్రణ, సంరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో వీధి కుక్కల సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, స్టెరిలైజేషన్‌ ప్రక్రియను పూర్తి చేయాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్‌ పింకేశ్‌కుమార్‌ అధికారులను ఆదేశించారు. మంగళవారం సదరు కేంద్రాన్ని సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలో 1200 వరకు వీధి శునకాలున్నాయని, సోమవారం నుంచి శస్త్రచికిత్సలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఆయన వెంట మున్సిపల్‌ కమిషనర్‌ వెంకటేశ్వర్లు, పారిశుద్ధ్య అధికారి గోపయ్య, ఎంతా మహిపాల్‌ ఉన్నారు.

శ్రీనివాస్‌ మృతి ఉద్యమాలకు తీరనిలోటు



జనగామ టౌన్‌, న్యూస్‌టుడే: జనగామకు చెందిన సీపీఎం సీనియర్‌ నాయకుడు బొట్ల శ్రీనివాస్‌ సోమవారం అస్వస్థతతో మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు శ్రీనివాస్‌ కుటుంబాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించి వారిని ఓదార్చారు. కమ్యూనిస్టు పార్టీలో ప్రజా ఉద్యమాలు నిర్వహించిన శ్రీనివాస్‌ మృతి ఉద్యమాలకు తీరనిలోటన్నారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పి.జమున, భారాస నాయకులు బాల్దె సిద్ధిలింగం, ప్రేమలతారెడ్డి, విజయ్‌, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ కాన్పులు చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పులు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. కాన్పుల వివరాల రికార్డులను తనిఖీ చేశారు. వార్డులను, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రిలో స్టాఫ్‌ నర్సుల కొరతతో ఇబ్బంది పడుతున్నట్లు ఆమె దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే సిబ్బందిని నియమించనున్నట్లు పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో స్వరూప

నర్మెట్ట, న్యూస్‌టుడే: విధుల పట్ల నిర్లక్ష్యం తగదని, గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగే అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీపీవో స్వరూప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని, వాటర్‌ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ క్లోరినేషన్‌ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో అరవింద్‌చారి, గ్రామపంచాయతీ కార్యదర్శి కె.శ్రీధర్‌, కారోబార్‌ చిర్ర వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి చేయూతనందించండి

తరిగొప్పుల, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న మిత్రులకు, వారి కుటుంబాలకు సాయం అందించడంలో తోటి స్నేహితులు ముందుండాలని జిల్లా పంచాయతీ అధికారి స్వరూపరాణి అన్నారు. సోలిపురం గ్రామ కార్యదర్శి చింతల కృష్ణ ఇటీవల పాముకాటుకు గురై మృతి చెందగా, ఆయనతో పాటు తరగతి చదివిన మిత్రులు కుటుంబానికి చేయూతనందించారు. మంగళవారం తరిగొప్పుల మండల కేంద్రంలో సంస్మరణ సభ ఏర్పాటు చేయగా, ఆమె హాజరయ్యారు. కృష్ణ పిల్లల పేరిట రూ.2,30,000లు డిపాజిట్‌ పత్రాలను డీపీవో ద్వారా అందజేశారు. కార్యక్రమంలో నర్మెట్ట ఎంపీడీవో అరవింద్‌ చౌదరి, ఎంపీవో మాలతి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే చిన్నారుల ఎదుగుదల



బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు చిన్నారులకు పోషకాహారం అందించాలని జడ్పీ సీఈవో సరిత అన్నారు. మంగళవారం బచ్చన్నపేట మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనంలో పోషణ్‌ అభియాన్‌ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 30మంది గర్భిణులకు దాత కొండి వెంకట్‌రెడ్డి చీరలు పంపిణీ చేశారు. బాలికల్లో రక్తహీనత లేకుండా పోషకాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి రామారావు, సీడీపీవో రామదేవి, ఎంపీడీవో వెంకటమల్లికార్జున్‌, తదితరులు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కు అందజేత

జనగామ రూరల్‌, న్యూస్‌టుడే: మండలంలోని వెంకిర్యాలకు చెందిన ఎడవెల్లి రాజేందర్‌ కుటుంబానికి రూ.1.50 లక్షల విలువైన ఎల్‌వోసీ పత్రాలను కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకుడు కిరణ్‌గౌడ్‌ మంగళవారం వారి నివాసంలో అందజేశారు. రాజేందర్‌ కుమార్తె దీపిక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, చికిత్స కోసం ఎల్‌వోసీ చెక్కు మంజూరు చేయించి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ మాజీ వైస్‌ఛైర్మన్‌ సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్‌, నాయకులు నర్సింగరావు, దండు సిద్దయ్య, ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌ పాల్గొన్నారు.



దుకాణాల ఎదుట నిలిచిన వరద..



వర్షంలో వాహనాలు



హైదరాబాద్‌ రోడ్డులో...

దంచికొట్టిన వాన



జనగామ టౌన్‌, జనగామ, న్యూస్‌టుడే: సుమారు 20 రోజుల విరామం అనంతరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో జడివాన కురిసింది. కత్తెర సీజన్‌ వరికోతలు ముమ్మరమై, ఖరీఫ్‌ కోతలకు సిద్ధమవుతున్న తరుణంలో మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా కురిసిన భారీ వర్షంతో రైతాంగం ఆందోళనకు గురైంది. వేసవి ఎండలను తలపిస్తూ, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు ఉపశమనాన్ని పొందారు. జిల్లాలో అత్యధికంగా దేవరుప్పులలో 11.5 సెం.మీ., అత్యల్పంగా తరిగొప్పులలో 5.6 మి.మీ కురిసింది. జనగామ పట్టణంలోని హైదరాబాద్‌ ప్రధాన రహదారిలో ఒక వైపు కాల్వలు పొంగడంతో మురుగు రోడ్లపైకి చేరింది.

☛ **మండలాల వారీగా వర్షం మి.మీలలో:** దేవరుప్పుల-115.8, లింగాలఘనపురం-25.8, జనగామ-19.3, పాలకుర్తి-6.3, కొడకండ్ల 5.5, చిల్పూరు-5.3, తరిగొప్పుల-4.8.

కలెక్టరేట్‌లో ఆర్యవైశ్యుల నిరసన



జనగామ అర్బన్‌, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పునకు రాష్ట్ర కేబినేట్‌ ఆమోదాన్ని వ్యతిరేకిస్తూ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పార్శి కమల్‌కుమార్‌ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిరసన చేపట్టారు. అనంతరం తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దని కోరుతూ కలెక్టర్‌ రిజ్వాన్‌బాషాకు ఆర్యవైశ్య సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు జొన్నల రాజేశ్వరరావు మాట్లాడుతూ.. కేబినేట్‌ తీసుకున్న నిర్ణయం ఆర్యవైశ్యులను కించపరిచినట్టుగా ఉందన్నారు. ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ తొలి అధ్యక్షుడు మహంకాళి హరిశ్చంద్రగుప్త, సంఘాల నాయకులు పజ్జూరి గోపయ్య, జైన రమేశ్‌, బుచ్చిబాబు, గంగిశెట్టి ప్రమోద్‌ పాల్గొన్నారు.

నర్మెట్ట, న్యూస్‌టుడే: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దని కోరుతూ ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు జోగిపర్తి ఉపేందర్‌ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం ఆవరణలో ఎమ్మార్వో రామానుజాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేరు మార్పు ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు రామిని శివరాజ్‌, మెతుకు మధు, బిక్షపతి, రాజు పాల్గొన్నారు.

హత్యారోపణలో మరో మలుపు

జనగామ, న్యూస్‌టుడే: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై జనగామ మున్సిపల్‌ మాజీ వైస్‌ ఛైర్మన్‌ కంచ రాములు పోలీసులకు ఫిర్యాదు ఘటన మరో మలుపు తిరిగింది. తనను హత్య చేసేందుకు కొమ్మూరి తన అనుచరుడైన రావుల శ్రీనివాస్‌రెడ్డికి సుపారి ఇస్తానన్నట్లు రాములు ఫిర్యాదు చేసిన సంగతి తెల్సిందే. ఈ వివాదంలో కీలక వ్యక్తి రావుల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పలు టీవీ ఛానళ్లతో మాట్లాడిన వీడియో వైరల్‌ అవుతోంది. 'కంచరాములు తనతో మాట్లాడాలని జనగామకు పిలిపించి, బెదిరించి కొమ్మూరిపై ఆరోపణలు చేయించారని, రహస్యంగా సంభాషణ చిత్రీకరించారని' పేర్కొన్నాడు. డీసీపీకి, సీఐకి ఫిర్యాదు విషయమూ తనకు ముందుగా తెలియదని వివరించడం గమనార్హం. కొమ్మూరి అలాంటి నేత కాదని, తమను దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేసిన కంచ రాములుపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ప్రకటించారు.

అర్హులకే రెండు పడక గదుల ఇళ్లు



కలెక్టర్‌ రిజ్వాన్‌బాషా, అధికారులతో సమావేశమైన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

జనగామ అర్బన్‌:, న్యూస్‌టుడే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మౌలిక సదుపాయాలు కల్పించి, అర్హులైన వారికి రెండు పడకల ఇళ్లు కేటాయిస్తామని పాలనాధికారి రిజ్వాన్‌బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్‌, అదనపు కలెక్టర్‌ రోహిత్‌సింగ్‌, సంబంధిత శాఖల అధికారులతో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్వినిరెడ్డి సమావేశమయ్యారు. పాలకుర్తి నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన రెండు పడకల ఇళ్లు అర్హులైన వారికి చెందేలా చర్యలు తీసుకోవాలంటూ ఆమె కలెక్టర్‌కు విన్నవించారు. పాలకుర్తి నియోజకవర్గంలో 2,505 రెండు పడకల ఇళ్లు మంజూరు కాగా 924 పూర్తి అయినట్లు తెలిపారు. 414 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా 315 మందికి కేటాయించామని, 590 మందిని ఎంపిక చేయాల్సి ఉందని కలెక్టర్‌ వివరించారు. ఆక్రమణకు గురైనవి, స్వాధీనం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో కొమురయ్య, హౌజింగ్‌ ఈఈ దామోదర్‌, పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల తహసీల్దార్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు సహకరించాలి..

జనగామ అర్బన్‌: స్టేషన్‌ఘన్‌పూర్‌ నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్‌ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్‌, పింకేశ్‌కుమార్‌లతో కలిసి కలెక్టరేట్‌లో ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు కడియం విన్నవించారు. ఈ మేరకు కలెక్టర్‌ మాట్లాడుతూ. స్టేషన్‌ఘన్‌పూర్‌ నియోజకవర్గంలో రూ.7.45 కోట్లతో చేపట్టిన 181 పనుల్లో ప్రారంభం కాని వాటిని త్వరగా చేపట్టేవిధంగా సంబంధిత అధికారులతో సమీక్షిస్తామని చెపారు. సమావేశంలో ఆర్డీవో వెంకన్న, ఏవో మన్సూరి, సీపీవో శ్రీనివాస్‌, పీఆర్‌ఈఈ శ్రీనివాసరావు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విద్యార్థుల చేయూత..

జనగామ అర్బన్‌: వరద బాధితుల సహాయార్థం జనగామ జిల్లా కేంద్రంలోని సెయింట్‌మేరీస్‌ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. వారు బంధువుల ఇంటింటికి వెళ్లి తోచినంత ఆర్థికసాయం కోరారు. సేకరించిన మొత్తం రూ.25వేల నగదును సీఎం సహాయనిధికి అందజేయాలని కోరుతూ ఆ పాఠశాల ప్రిన్సిపల్‌ బసాని శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులు కలెక్టరేట్‌ రిజ్వాన్‌బాషాకు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లలను పాలనాధికారి అభినందించి, ప్రతి ఒక్కరూ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.



మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ప్రమోద్‌

జనగామ టౌన్‌, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా గంగిశెట్టి ప్రమోద్‌కుమార్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక సంఘ కార్యాలయంలో వెంకటేష్‌, రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నిక కార్యక్రమంలో ప్రమోద్‌కుమార్‌ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. సంఘం నాయకులు కమల్‌కుమార్‌, జైన రమేష్‌, హరిశ్చంద్రగుప్త, రాజేశ్వర్‌, పజ్జూరి గోపయ్య పాల్గొన్నారు.

గురుకులాల సమస్యలపై వినతి



జనగామ అర్బన్‌, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాలల పని వేళలను శాస్త్రీయంగా నిర్వహించాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్‌, గురుకులాల ఐక్య వేదిక జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌ రిజ్వాన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల పనివేళలు విద్యార్థుల మానసిక వికాసానికి తగినవిధంగా ఉండాలన్నారు. జిల్లా కార్యదర్శి సుధీర్‌రెడ్డి, ఆకుల శ్రీనివాసరావు, రవీందర్‌, కిషన్‌, సత్యం, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నిక

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: గొర్రెల పెంపకందారుల సంఘం నూతన కమిటీ ఎన్నికైనట్లు జిల్లా సహకార శాఖ పర్యవేక్షకులు వేణుగోపాల్‌ తెలిపారు. రఘునాథపల్లి శ్రీబీరప్ప గొర్రెల పెంపకందారుల ఫెడరేషన్‌ కమిటీ ఎన్నికను మంగళవారం నిర్వహించారు. అధ్యక్షునిగా పేర్నె రవి, ఉపాధ్యక్షుడు బడితె శ్రీనివాస్‌, కార్యదర్శి జంపయ్య, డైరెక్టర్లు వెంకటేశ్‌, నాగరాజు, అనిల్‌, ప్రసాద్‌, లెనిన్‌, రాజు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

యువకుడి ఆత్మహత్య



దిలీప్‌ (పాత చిత్రం)

రఘునాథపల్లి: చదువులో రాణించలేకపోతున్నానని మనస్తాపంతో ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. . వెల్ది గ్రామానికి చెందిన రాపాక పరశురాములు కుమారుడు దిలీప్‌(22) డిగ్రీ చదువుతున్నాడు. పరీక్షల్లో కొన్ని సబ్జెక్టులు ఫెయిల్‌ అయ్యాడు. మనస్తాపం చెంది గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నరేశ్‌ తెలిపారు.

ఆర్థిక సాయం

స్టేషన్‌ఘన్‌పూర్‌, న్యూస్‌టుడే: మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు అలుగోజు చిరంజీవి తల్లి లక్ష్మి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. పార్టీ గ్రామ కమిటీ నేతలు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.12,600 ఆర్థిక సాయం అందించారు. నాయకులు దుంపల పద్మారెడ్డి, మాజీ ఉప సర్పంచి ఇంద్రసేనరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు లింగారెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తూ..

స్టేషన్‌ఘన్‌పూర్‌ నియోజకవర్గం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్‌ ఏసీడీపీవో సత్యవతి, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి అన్నారు. పోషణ మాసంలో భాగంగా మంగళవారం బండ్లగూడెం రైతువేదిక భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిషోర బాలికలు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యులు రవితేజ, హారిక సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు. .

చెరువు భూములపై సర్వే

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శనిగె చెరువు శిఖం భూములు, మత్తడి ఎత్తు, మరమ్మతుల నిధులపై నిగ్గుతేల్చాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు ప్రజలు ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌ ఆదేశానుసారం మంగళవారం భూమి కొలతలు, రికార్డులు, సాగునీటి వనరుల(ఐబీ) శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే, విచారణ జరిపారు. భూమి కొలతల శాఖ జిల్లా అదనపు సంచాలకుడు మాన్యం కొండల్‌, డీఐవో నూకరాజు నేతృత్వంలో స్థానిక చెరువులోని 125.26 ఎకరాల భూమిని సర్వే చేసి హద్దులను గుర్తించారు. ఐబీ ఏఈ గీత చెరువు పునరుద్ధరణకు కేటాయించిన నిధులు, జరిగిన పనులపై విచారణ జరిపారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేయర్‌ మహేందర్‌, కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.11.71 లక్షలు



చిల్పూర్‌, న్యూస్‌టుడే: చిల్పూర్‌గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని మంగళవారం భువనగిరి డివిజన్‌ అధికారి ఎం.వి. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో లెక్కించారు. పది హుండీలను లెక్కించగా గత ఐదు నెలల 24 రోజులకు గాను మొత్తం ఆదాయం రూ.11,71,350 వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మల్కాపూర్‌ ఇండియన్‌ బ్యాంక్‌ శాఖ అధికారులు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర, శ్రీలక్ష్మి శ్రీనివాస, వైష్ణవి సేవా సమితిల సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవ అలవర్చుకోవాలి

జఫర్‌గఢ్‌, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ అలవర్చుకోవాలని జఫర్‌గఢ్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌ రాజు అన్నారు. మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్‌తో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్‌ రాజు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా రాధాకృష్ణ



జఫర్‌గఢ్‌, న్యూస్‌టుడే: మండల ప్రత్యేక అధికారిగా పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి రాధాకృష్ణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన అధికారి పదవీ విరమణ పొందడంతో రాధాకృష్ణను నియమించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్లాస్టిక్‌ వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తాలో కొందరు ప్లాస్టిక్‌ వస్తువులను విచ్చలవిడిగా పారబోస్తుండటంతో అవి గాలికి నివాస ప్రాంతాల్లో చేరుతున్నాయని సోమేశ్వర్‌ అనే యువకుడు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరచారి స్పందించి, సిబ్బందితో ఏరివేయించారు.

నర్మెట్ట సీఐగా అబ్బయ్య



నర్మెట్ట, న్యూస్‌టుడే: నర్మెట్ట నూతన సీఐగా ఎం.అబ్బయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన ఎం.సాయిరమణ బదిలీపై దుగ్గొండి సీఐగా వెళ్లగా ఆయన స్థానంలో సీసీఎస్‌, వరంగల్‌ నంచి ఎం.అబ్బయ్య బదిలీపై నర్మెట్టకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దేవరుప్పుల రూరల్‌, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అప్పిడి సోంరెడ్డి, ఇల్లందుల ఎల్లయ్య, బానోతు రాము ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాలను మంగళవారం కాంగ్రెస్‌ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు నల్ల శ్రీరాం, నాయకులు తోటకూరి పాండు కృష్ణ, మొల్గూరి రమేష్‌, రెడ్డిరాజుల రమేష్‌, రాజేందర్‌, సోమనర్సయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు శారీరక ధృడత్వం అవసరం

కొడకండ్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు మానసిక, శారీరక ధృడత్వంతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ ఫిజియోథెరపిస్ట్‌ డాక్టర్‌ సిద్ధారెడ్డి తెలిపారు. మంగళవారం మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో కొడకండ్ల ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఆందోళనకు గురి కాకుండా ఉండాలని, ఏదైన సమస్య తలెత్తితే సన్నిహితులతో చర్చించుకొని పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌ శ్రీనివాస్‌, వైద్యాధికారి డాక్టర్‌ హరికృష్ణ, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కళాశాలల ఏర్పాటుకు డిమాండ్‌

పాలకుర్తి, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రంలో ఇంటర్‌, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేశ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం పాలకుర్తిలోని చాకలి ఐలమ్మ స్మారక భవనంలో నిర్వహించిన మహాసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జెండా ఎగురవేసి నినాదాలు చేశారు. కళాశాలలు లేకపోవడంతో నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు దూరభారంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా!

ఈ క్రింది షెడ్యూలులో తెలిపిన వ్యవసాయ భూమి, దాని యొక్క యజమానులైన, (1) బాసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, తండ్రి: కోటిరెడ్డి, నివాసము: ఇంటి నెం. 4-57/5/2, ఈస్ట్‌ గాంధీనగర్‌, కీసర గ్రామము మరియు మండలము, మేడ్చల్‌-మల్కాజ్‌గిరి జిల్లా మరియు (2) పిట్టల సత్యం, తండ్రి: రాంచందర్‌, నివాసం: ఇంటి నెం. 4-13-19, సంజయ్‌ నగర్‌, జనగాం పట్టణము, మండలం మరియు జిల్లా గారలు అమ్మజూపగా, నా క్లయింటు ఖరీదు చేసుకొనుటకు నిర్ణయించుకొని కొంత మొత్తము బయానాగా చెల్లించి విక్రయ ఒప్పందనామా కుదుర్చుకొని యున్నారు. ఇట్టి కొనుగోలుకు సంబంధించి ఇతరులెవరికైన, ఏమైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు, హక్కులు గాని ఉన్నచో, అట్టి వాటి నిరూపణకై తగిన సాక్ష్యాధారములతో క్రింద తెలిపిన చిరునామా యందు ఈ ప్రకటన తేది నుండి 7 పనిదినములలో సంప్రదించగలరు. లేని యెడల నా క్లయింటు కొనుగోలు దస్తావేజులను రిజిష్టరు చేసుకొనగలరు, గడువు తరువాత వచ్చిన అభ్యంతరాలు, ఆక్షేపణలు, హక్కులు పరిగణింపబడవు మరియు చెల్లబడవు.

షెడ్యూల్‌

జనగాం జిల్లా, రఘునాథ్‌పల్లి మండలము, ఖిలాషాపూర్‌ రెవెన్యూ గ్రామములోని వ్యవసాయ భూమి సర్వే నెం. 795/2, విస్తీర్ణం ఎ. 02-10 గుంటలు మరియు సర్వే నెం. 795/1/1/2/2, విస్తీర్ణం ఎ. 00-30 గుంటలు, మొత్తము విస్తీర్ణం ఎ. 03-00 గుంటలు ఈ క్రింది హద్దులు కలది. **ఉత్తరం:** మద్దెల శ్రీశైలం గారి వ్యవసాయ భూమి, **దక్షిణము:** రోడ్డు, **తూర్పు:** రోడ్డు, **పడమర:** పిట్టల సత్యంగారి వ్యవసాయ భూమి.

ఇట్లు/- **వల్లందాసు వెంకటయ్య గౌడ్‌,** అడ్వకేట్‌
ఇంటి నెం: 1-3-436/1/ఎ, బంజారాహిల్స్‌,
భువనగిరి, యాదాద్రి-భువనగిరి జిల్లా, సెల్‌: 98854 89102